**క్రైమ్ స్టోరీ**

# పక్కింటి ప్రేమాయణం

ప్రఫుల్లచంద్ర

**పద్మను ఎవరో హత్య చేశారు. ఆమె కాపురానికొచ్చి ఆరు నెలలే అయింది. రెండు నెలల వరకు దంపతులమధ్య ఏ పొరపొచ్చాలూ లేవు. తర్వాతే కీచులాటలు. విడాకులిచ్చేస్తా, పుట్టింటికి పో, లేకుంటే చంపేస్తానని గత నాలుగు నెలలుగా జగదీశ్ బెదిరిస్తూనే ఉన్నాడు.**

హత్య జరిగిన రోజు సాయంకాలం కూడా జగదీశ్ అదే విధంగా బెదిరించి విసురుగా బయటకుపోయి అలా తిరిగి తిరిగి సినిమాకెళ్ళాడు. సినిమా నుంచి వచ్చి చూస్తే భార్య చచ్చిపడి వుంది అని అతడు రాత్రి తొమ్మిదిన్నరకు పోలీసులకు ఫోన్‌లో చెప్పాడు.

జగదీశ్ తల్లిదండ్రులు ప్రతి ఏటా వెళ్ళినట్టే ఈసారి కూడా తిరుపతికి వెళ్ళారు. రెండు మూడు రోజుల్లో తిరిగి వస్తారు. ఇంట్లో ఒంటరిగా వున్న పద్మను బెడ్‌రూంలో ఎవరో బాకుతో పొడిచి చంపారు. రక్తసిక్తమైన బాకు శవం ప్రక్కనే పడి వుంది. దాని పిడిమీద జగదీశ్ వేలి ముద్రలున్నాయి. గదిలో కుటుంబ సభ్యులవి తప్ప యితరుల వేలి ముద్రలు లేవు.

మూడోరోజున తిరుపతి యాత్ర నుంచి వచ్చిన జగదీశ్ తల్లిదండ్రులు- ఇల్లు సీజ్ చేసి ఉండడం, పోలీస్ కాపలా చూసి ఆశ్చర్యపోయారు. కోడలి హత్య, కొడుకు అరెస్ట్ గురించి తెలుసుకొని నిర్ఘాంతపోయారు. చేసేది లేక బంధువుల యింట తల దాచుకున్నారు.

★ ★ ★

ప్రఖ్యాత లాయర్ చైతన్య, విఖ్యాత డిటెక్టివ్ విక్రమ్ కలిసి 'న్యాయం కోసం, న్యాయం కోసం మాత్రమే' అన్న ఆదర్శంతో స్థాపించిన 'చైతన్య విక్రమం' సంస్థకు వెళ్ళి వాళ్ళని కలిశాడు జగదీశ్ తండ్రి పాపారావు.

కోడలికి పక్కింటి కుర్రాడితో అక్రమ సంబంధం ఉందని, అందువల్ల తన కొడుకు చిరుబుర్రులాడుతూ చంపేస్తా అని అరుస్తాడుగానీ తీవ్ర స్వభావి కాదని, వాడీ హత్య చేయలేడు, మీరే కాపాడాలి అని వేడుకున్నాడు.

"హత్య చేయడానికి మీ అబ్బాయికి తగిన కారణం ఉండనే ఉంది" సాలోచనగా అన్నాడు విక్రమ్.

"సినిమాకెళ్ళి రాత్రి ఎనిమిది ప్రాంతంలో ఇంటికొచ్చి భార్యని చంపేసి మళ్ళీ సినిమాకు పోయి ఎలిబీ సృష్టించుకొని సినిమా అయాక ఇంటికొచ్చి ఏమీ ఎరగనట్లు పోలీసులకు మావాడు ఫోన్ చేశాడని ఇన్‌స్పెక్టర్ గోపాల్ నమ్మకం. ఎంత బుద్ధిహీనుడైనా స్వంత యింటిలో హత్య చేసి బాకు మీద వేలి ముద్రలు తుడిచేయకుండా అలా పడేసిపోతాడా?" పాపారావు స్వరంలో ఆవేశం పెల్లుబికింది.

విక్రమ్ సమాధానం చెప్పలేదు. అంతవరకూ మౌనంగా ఆయన్నే పరిశీలిస్తూ ఉండిపోయిన చైతన్య "రేపు ఇన్‌స్పెక్టర్‌ని కలిసి వివరాలు తెలుసుకొని నేనీ కేసు టేకప్ చేసేదీ లేనిదీ చెబుతాను" అన్నాడు.

"ప్రాథమిక సమాచారం ప్రకారం మేము కేసు టేకప్ చేసినా తర్వాత మీవాడు నేరం చేసినట్టు సాక్ష్యం లభిస్తే మాత్రం కేసు నుంచి తప్పుకోవడమే కాక అతనికి శిక్ష పడేట్టు చూస్తాం. అది జ్ఞాపకం ఉంచుకోండి" హెచ్చరించాడు విక్రమ్.

★ ★ ★

ఇన్‌స్పెక్టర్ గోపాల్ కొత్తగా ఉద్యోగంలో చేరాడు. గొప్ప గొప్ప కేసులు పరిష్కరించి పెద్ద పేరు సంపాదించాలన్న తపన ఉంది. చైతన్య విక్రమం సంస్థ గురించి విన్నాడు. చదివాడు. ఎదురుగా వాళ్ళిద్దరూ కూర్చుని తమ రాకకు కారణం చెప్పగానే తనకు పోటీ అనుకున్నాడేమో ముఖం ముడుచుకున్నాడు.

"జగదీశ్ నేరాన్ని నిరూపించడానికి మీ వద్దనున్న సాక్ష్యాధారాలేమిటో చెబుతారా?" అని మృదువుగానే అడిగాడు చైతన్య.

ఇన్‌స్పెక్టర్ సందిగ్ధంలో పడ్డాడు. నిజానికి తను కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు ఎవరికీ చూపనక్కరలేదు. కేసు గురించి చర్చించనక్కరలేదు. కానీ అడుగుతున్నది చైతన్య మరి!

"ఇన్‌స్పెక్టర్! మీ సర్వీస్‌లో మొదటి ముఖ్యమైన కేసులో మీరే విజయం సాధించాలని మా కోరిక. మేము న్యాయం కోసం పోరాడే వాళ్ళమే కాని, కీర్తి కోసం, డబ్బు కోసం కాదు. జగదీశ్ నిజంగా హంతకుడే అయితే మేమీ కేసులో కల్పించుకోం. అందువల్ల మీ వద్దనున్న సాక్ష్యాధారాల బలాబలాన్ని కోర్టులోకన్నా యిక్కడే తేల్చుకోవడం మీకూ మంచిదే" నచ్చ జెప్పాడు విక్రమ్.

అదీ నిజమే అనిపించి కేసు గురించి వివరించాడు గోపాల్.

"రాత్రి ఏడున్నర, తొమ్మిది మధ్య హత్య జరిగింది. ఇంటికి దగ్గరగా వున్న థియేటర్‌లో సినిమా చూస్తున్న జగదీశ్ ఇంటర్వెల్ అయాక సుమారు ఎనిమిదికి బయటకు వెళ్ళ కాసేపటికి తిరిగి రావడం గేట్ కీపర్ చూశాడు. ఆ సమయంలో టాయ్‌లెట్‌కి వెళ్ళానని జగదీశ్ చెబుతున్నాడుగాని యింటికెళ్ళి హత్య చేసి ఉండొచ్చు"

"థియేటర్ నుంచి వెళ్ళేటప్పుడు, తిరిగి వచ్చినప్పుడు అతని డ్రెస్ మారిందా?"

చైతన్య ప్రశ్నకు యిబ్బందిగా కదిలాడు గోపాల్. అతడా విషయం విచారించ లేదు.

"బాకుతో పొడిచినప్పుడు జగదీశ్ బట్టల మీద రక్తం చింది వుంటుంది. అతడు తప్పకుండా డ్రెస్ మార్చుకొని మళ్ళీ థియేటర్‌కి వెళ్ళి ఉండాలి. ఆ విషయం నిరూపించలేకపోతే ఈ కేసులో అదో వీక్ పాయింట్ అవుతుంది" మృదువుగా చెప్పాడు చైతన్య.

గోపాల్ థియేటర్‌కి ఫోన్ చేసి గేట్ కీపర్‌ని అడిగాడు. తను ఆ విషయం గమనించలేదని చెప్పాడతడు.

పోస్ట్‌మార్టం రిపోర్ట్‌ని శ్రద్ధగా చదువుకొని సీలు చేసిన పోలిథిన్ కవరులో వున్న హత్యాయుధాన్ని భూతద్దంలో నిశితంగా పరిశీలించాడు చైతన్య.

పిడివద్ద నాలుగు అంగుళాల వెడల్పుంది ఆ బాకు. పొడవు ఆరు అంగుళాలు. నిండా రక్తం పరుచుకొని ఎండిపోయింది. బలంగా పిడి వరకూ బాకు శరీరంలో దిగి ఉండాలి.

తర్వాత-వివిధ కోణాల్లో తీసిన శవం ఫోటోలు భూతద్దంలో పరిశీలించి లేచాడు చైతన్య.

"మీరు స్వాధీనం చేసుకున్నది హత్యాయుధం కాదు, ఇన్‌స్పెక్టర్! దానితో హత్య జరగలేదు. మిమ్మల్ని తప్పుదోవ పట్టించడానికి దాన్ని ఎవరో అక్కడ పడేశారు. మీ వద్దనున్న సాక్షాధ్యారాలతో కోర్టుకెళితే ఓడిపోక తప్పదు" ఖచ్చితంగా చెప్పాడు చైతన్య.

నిర్ఘాంతపోయాడు గోపాల్ "అయితే జగదీశ్ నిర్దోషి అంటారా?"

"చెప్పలేం. కోర్టులో హత్యాయుధం ప్రదర్శించకపోతే కేసు వీగిపోతుందని తెలిసి అతడే మరో బాకుతో హత్య చేసి దాన్ని మాయం చేసి దీనికి రక్తం పట్టించి అక్కడ పడేసి ఉండాలి. లేదా నేరం అతని మీదకు నెట్టేయడానికి మరొకరు ఆ పని చేసి ఉండాలి"

గోపాల్‌కి తనని చైతన్యే తప్పుదోవ పట్టిస్తున్నాడేమోననిపించింది!

అతని భుజం తట్టి "నిందితుని యిల్లు సీజ్ చేశారు కాబట్టి మరోసారి సోదా చేయండి. పెరటిలో తవ్వి పాతి


పెట్టారేమో చూడండి. మరో బాకు దొరకవచ్చు" సలహా యిచ్చాడు విక్రమ్.

* * *

ఆదివారం.

తల్లిదండ్రులు స్వగ్రామం వెళ్ళడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న రాజా బద్ధకంగా రోడ్డున పోతున్న జనాన్ని చూస్తూ వరండా మీద నిల్చున్నాడు.

టోపీ పెట్టుకున్న జటాయువులాగా డొక్కు సైకిల్ మీద వస్తున్న మనిషిని అంతదూరంలో చూడగానే నవ్వొచ్చింది. ఆ మనిషి నేరుగా వచ్చి తమ యింటి ముందే సైకిల్ దిగి దాన్ని వరండాకు ఆనించే క్రమంలో సైకిల్ కింద పడింది.



దాన్ని ఎత్తబోయి అతడూ కిందపడ్డాడు. ఆ సైకిల్‌కి స్టాండ్ లేదు!

రాజా నవ్వుకుంటూ వరండా దిగి సైకిల్ ఎత్తి వరండాకి చేర వేసి ఆ మనిషికి చెయ్యి అందించాడు. ఆ చెయ్యి పట్టుకుని లేస్తూ-

"నీకు వేరే పని లేదా? ఎందుకు పక్కింటి పద్మను చంపేశావ్?" అడిగాడా మనిషి.

ఉలిక్కిపడి చూశాడు రాజా.

శరీరం అంతా కోస్తే కేజీ మాంసం ఉండదు. క్షయ రోగి లాగా సన్నగా ఒంగిపోయి ఉన్నాడు. పైగా మెల్ల కన్ను! ఎటు చూస్తున్నాడో తెలియడం లేదు. సినిమా తెరమీంచి తప్పించుకొచ్చిన హాస్య నటుని లాగా కనిపిస్తున్నాడు.

రాజా షాక్ అవడం చూసి చిన్న పిల్లాడి లాగా కేరింతలు కొడుతూ "బెదిరిపోయావా? అదీ ఈ డేగ చూపు డిటెక్టివ్ భయంకర్ దెబ్బంటే" లేచి నిలబడ్డాడు నవ్వుతూ.

"ఏమిటీ, వాగుతున్నావ్! నేను హత్య చేయడం ఏమిటి?" గద్దించాడు రాజా.

అతడు గోలీ సోడా కొట్టినట్టు తుస్సున నవ్వాడు. "నువ్వు హత్య చేయలేదు లేవయ్యా! ఊరికే షాక్ ట్రీట్‌మెంట్ యిచ్చాను. డిటెక్టివ్‌ని కదా!"

'ఖర్మ! నువ్వు డిటెక్టివ్‌వి ఏమిట్రా బాబూ!' అని నెత్తి బాదుకున్నాడు రాజా.

అతని అనుమతి లేకుండానే కుంటి కొంగ లాగ యింట్లోకి నడిచి ఒంటి కంటి డేగలాగ యిల్లంతా పరిశీలించి "పక్కింటి పద్మకు లైన్ వేయడానికి వీలుగానే కిటికీలూ, గుమ్మాలూ ఉన్నాయి!" అని మెల్లకన్ను కొట్టాడు భయంకర్.

రాజా ఒళ్ళు మండిపోయింది "ఎవడివయ్యా నువ్వు! పో బయటకు!"

"కోప్పడకు బాబూ! నేను డిటెక్టివ్ కానని చెప్పానుగా. ఏకాక్షీ డిటెక్టివ్ ఏజన్సీలో పార్ట్‌టైమర్‌గా పనిచేస్తున్నా. నా రోజు కూలి పాతిక రూపాయిలు నాకు దక్కాలంటే నా ప్రశ్నలకు నువ్వు జవాబులు చెప్పాలి లేదా నువ్వే ఆ పాతికా యిచ్చేస్తే నేను నోరు మూసుకొని పోతా" బ్రతిమాలుతూ ఆయాసంగా కుర్చీలో కూలబడి, షర్ట్ గుండీలు విప్పుకొని ఫ్యాన్ గాలి శరీరానికి పట్టించాడు.

"పక్కింటి పాపారావు తన కొడుకు నిర్దోషిత్వం నిరూపించడానికి లాయర్ చైతన్యని కలిశాడు గాని..ఆయన..ఈయన కాకమ్మ కథ నమ్మలేదు. దాంతో ఆశ వదలని విక్రమార్కుడిలా ఈయన ఏకాక్షీ డిటెక్టివ్ ఏజన్సీకొచ్చి నువ్వే తన కోడల్ని ముగ్గులోకి దించి చంపావని చెబితే మా బాస్ నమ్మేసి నన్ను యిక్కడికి పంపాడు. నీకు తెలిసిందంతా చెప్పుబాబూ" దీనంగా అడిగాడు.

పాతిక రూపాయిలిచ్చుకునే బదులు తన కథ చెప్పుకోవడమే మంచిదనిపించింది రాజాకి.

"విజయవాడ కాలేజీలో పద్మ నాకు జూనియర్. ప్రేమించుకున్నాం. ఆమెకు వివాహం జరగడంతో మా ప్రేమ కట్.

హత్య జరిగిన రోజు రాత్రి ఏడుగంటలకే నేను రైల్వేస్టేషన్‌లో వున్నా. హత్యా సమయంలో గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో వున్నా. ఉదయం ఎనిమిదికి సికిందరాబాద్ స్టేషన్‌కెదురుగా వున్న మానస హోటల్‌లో రూం తీసుకున్నా. రైల్వే రిజర్వేషన్ చార్ట్, హోటల్ రికార్డు మీరు చెక్ చేసుకోవచ్చు."

రాజా చెబుతూనే వున్నాడు. భయంకర్ లేచి గోడకు బిగించిన అద్దం ఎదుట నిలబడి వివిధ కోణాల్లో తన అందం చూసుకొని కిచకిచ నవ్వుకున్నాడు. అక్కడున్న దువ్వెనలోని జుట్టు తీసి వాసన చూసి కిందపడేసి విజిల్ వేస్తూ తల దువ్వుకున్నాడు.

తర్వాత రాజా వద్దకొచ్చి "దువ్వెనలోని నీ జుట్టు వాసన బట్టి నువ్వు నవరత్న తైలం రాసుకుంటావని గ్రహించాను. డిటెక్టివ్‌ని కదా! మరి నా జుట్టు వాసన చూసి నేనే తైలం రాసుకున్నానో చెప్పగలవా?" అంటూ తన తల అతని ముక్కు వద్దకు వాల్చాడు భయంకర్.

ఏదో వాసన వస్తోందిగానీ ఆ తైలం ఏమిటో తెలియలేదు రాజాకి. వాసన చూస్తూండగానే అతనికి నిద్ర ముంచుకొచ్చి కళ్ళు మూతలు పడ్డాయి. కుర్చీలో వాలిపోయాడు.

భయంకర్ -గుర్రం సకిలిస్తున్నట్టు నవ్వి కిచెన్‌లోకి వెళ్ళి అల్మారాలోని డబ్బాలు, సీసాలు వెదికి కిస్మిస్, జీడిపప్పులు కొన్ని తిని, కొన్ని ఉదారంగా జేబులో వేసుకున్నాడు. డబ్బాల వెనక గుట్టుగా దాక్కున్న ఒకదాన్ని తీసి జేబులో పడేసుకున్నాడు. ఇందాక తల దువ్వుకుంటూ కింద పడేసిన జుట్టుని తీసి దాన్ని జేబులో వేసుకొని టీ చేసి రెండు కప్పుల్లో తెచ్చాడు.

"లే..లే..లే..నా రాజా" పాట పాడుతూ రాజాని తట్టి లేపాడు. అతడు కళ్ళు తెరవగానే టీ యిస్తూ-

"అదేమిటోయ్! ఆఫీసులో నిద్ర చాలదా? సెలవు రోజు ఇంట్లోనూ నిద్రపోవాలా?" జోక్ చేశాడు. రాజా టీ తాగుతోంటే తనూ తాగుతూ

"నువ్వు యించక్కా హత్య జేసి ఉంటావు. నేనించక్కా క్లూస్ సంపాదించి బాస్‌కిస్తే కూలితోబాటు నాలి యిస్తాడని పొంగిపోతే నువ్వు చెప్పిందంతా పనికి రాని ట్రాష్" అన్నాడు.

టీ కప్పు ప్రక్కన పెట్టి చిరాకుగా అతని మెడపట్టి బయటకు గెంటేశాడు రాజా.

ఆ సంఘటన జరిగిన నాలుగు రోజులకు రాజా ఆఫీసుకెళ్ళే హడావుడిలో ఉండగా ఇద్దరు యువకులు, ఒక యువతిలోని కొచ్చి కుర్చీల్లో కూర్చున్నారు.

"ఎవరండీ మీరు? నేరుగా లోనికొచ్చేశారు! తర్వాత రండి. నేనిప్పుడు ఆఫీసుకెళ్ళాలి" చిరాకుగా అన్నాడు రాజా షూస్ వేసుకుంటూ.

"నేను డిటెక్టివ్ విక్రమ్. ఆయన లాయర్ చైతన్య. సరే. ఈమె మీకు తెలుసు" పరిచయాలు చేశాడు విక్రమ్.

రాజా ఆమెవైపు ఓ క్షణం చూసి "సారీ! ఈమె ఎవరో నాకు తెలియదు. ఎప్పుడూ చూడలేదు. మీరు బయట కెళతారా? నేను ఆఫీసుకెళ్ళాలి" చిరచిరలాడాడు రాజా.

"మీరు ఆఫీసుకెళ్ళే పని లేదు మిస్టర్! పక్కింటి పద్మను హత్య చేసినందుకు అరెస్ట్ చేయడానికి పోలీసు లొస్తున్నారు"

సరిగ్గా అప్పుడే వచ్చిన ఇన్‌స్పెక్టర్ గోపాల్ గుమ్మంకి అడ్డంగా నిల్చున్నాడు.

రాజా ఓ క్షణం బెదిరినా "నేనెవర్నీ హత్య చేయలేదు. నన్ను నమ్మండి సార్! ఆ సమయంలో నేను గౌతమిలో కోచ్ నంబర్ సెవెన్‌లో ఇరవై ఆరో సీటులో ఉన్నాను. ఉదయం ఏడున్నరకు ట్రెయిన్ దిగి ఎనిమిదికి మానస హోటల్‌లో ఉన్నాను" బింకంగా అన్నాడు.

"అందుకే మిమ్మల్ని అరెస్ట్ చేయాలని చెప్పేది!" గలగలా నవ్వేశాడు చైతన్య.

"గౌతమిలో తమరెక్కిన కోచ్‌లోనే మీ ప్రక్కసీటులోనే కూర్చున్న ఈ అమ్మాయిని చూడలేదంటున్నారు. అదీ కాక బిట్రగుంటలో గూడ్స్ బండి పట్టాలు తప్పడం వల్ల అన్ని రైలుబళ్ళు ఆలస్యంగా నడిచాయి. గౌతమి తొమ్మిది గంటలకు గానీ సికిందరాబాద్‌కి చేరలేదు. మరి మీరు ఎనిమిదికే హోటల్‌లో ఎలా వున్నారు?" నవ్వుతూ అడిగాడు విక్రమ్.

హఠాత్తుగా బోనులో చిక్కుకున్న జింకలాగా అయాడు రాజా. చెమట పట్టేసింది.

కన్నీళ్ళు జల జల..ఉక్కిరి బిక్కిరిగా కుర్చీలో కూలబడ్డాడు.


"నువ్వు ఎలా, ఎందుకు హత్య చేశావో మేము విచారణ చేసి కనుక్కోగలం. కానీ నువ్వే చెబితే మాకు శ్రమ తగ్గించిన వాడివి అవుతావు" మృదువుగా అన్నాడు చైతన్య.

రాజా తల వాలిపోయింది. మాటల కోసం తడుముకుంటూ "నేను గౌతమిలో ప్రయాణం చేయనంత మాత్రాన నామీద హత్యానేరం మోపడం న్యాయమా?" అడిగాడు.

ఇంకా దబాయింపా అన్నట్లు నవ్వాడు చైతన్య.

పోస్ట్‌మార్టం అయాక శవాన్ని బంధువులకు అప్పగించేస్తారు. అయితే ఆ తర్వాత ఏదన్నా కొత్త సాక్ష్యాధారాలు దొరకవచ్చని శవం బాపతు రక్తం, గోళ్ళు, కేశాలు, చర్మం-ఇలా అన్నింటికీ సంబంధించిన వివరాలు లాబరేటరీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు.

చనిపోయేముందు పద్మ హంతకునితో పెనుగులాడింది. అప్పుడు హంతకుని కేశాలు కొన్ని ఆమె గుప్పిట చిక్కాయి. అదీకాక హత్యాయుధాన్ని కడిగి వేస్తే రక్తం జాడలు పోవచ్చుకానీ



## అలవాటు

**తారలకి ఏవో కొన్ని అలవాట్లుంటాయి. అక్షయ్‌కుమార్‌కి ఈమధ్య ఓ అలవాటైనట్టుంది. ఐదేళ్లక్రితం తండ్రి సరదాగా కొనిచ్చిన ఓ బైక్‌ని ఎక్కువగా ఉపయోగిస్తున్నాడు. సినిమా షూటింగ్స్‌కి వెళ్లేటప్పుడు ఒక్కోసారి కారు ఉపయోగించకుండా ఈ బైక్‌ని తీసుకెళ్తున్నాడట. అన్నట్టు హెల్మెట్ తప్పకుండా వాడుతున్నాడట. ఎందుకంటే అభిమానుల తాకిడి ఎక్కువగా ఉండడం కూడా ఇందుకు కారణంగా భావిస్తున్నారు. 'ఈ బైక్ అంటే నాకెంతో ఇష్టం' అంటున్నాడు అక్కీ.**

కొన్ని సూక్ష్మ అవశేషాలు అంటుకొని ఉంటాయి. పద్మని హతమార్చిన బాకుకీ, దాని పిడికీ మధ్య కడిగి తీసెయ్యడానికి కుదరని సందుల్లో ఘనీభవించిన రక్తకణాలు, చర్మ కణాలు ఉన్నాయి.

"ఎప్పుడు ఎలా అని అడక్కుగాని, నీ జుట్టుని కిచెన్ అల్మారాలో డబ్బాల వెనక దాచిన హత్యాయుధాన్నీ మేం తీసుకున్నాం. బాకు సందుల్లో మిగిలిన రక్త, చర్మ కణాలు పద్మవే అని నిరూపణ అయింది. ఆమె చేత చిక్కిన కేశాలు సందేహం లేకుండా హంతకుడెవరో చెప్పాయి. ఈ వివరాలూ చాలా? ఇంకా కావాలా?"

రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొని రోదించాడు రాజా.

"ఇప్పుడు చెప్పు ప్రేమించిన మనిషిని ఎందుకు హత్య చేశావు?" ఈసారి ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

ఏడుస్తూ ఎక్కిళ్ళు పడుతూ చెప్పాడు రాజా.

* * *

పద్మకు వివాహమై కాపురానికెళ్ళినా ఆమె మీద మోజు తీరని రాజా రెండు నెలలకే వాళ్ళ ఊరికి బదిలీ చేయించుకొని పక్కింటి లోనే అద్దె యిల్లు చూసుకున్నాడు. రెండిళ్ళ కిటికీలూ, గుమ్మాలూ అనుకూలంగా ఉండడంతో ఇద్దరూ సైగలు చేసుకోవడం, రాత్రి అందరూ నిద్రించాక, ఇంటి వెనకాల కలుసుకోవడం ప్రారంభించారు.

ఈ విషయం గ్రహించిన జగదీశ్ భార్యని మందలించడం, గొడవ పడడం, జరుగుతూనే ఉంది. ఎప్పుడో ఓ రోజు దాడి చేసే అవకాశం ఉండడంతో చేతికి గ్లవ్స్, బొడ్డులో బాకుతో తన జాగ్రత్తలో తను ఉన్నాడు రాజా. అయినా యిద్దరూ కలుసుకోవడం మానలేదు.

అలా రెండు నెలలు గడిచాక-

ఆయన విడాకులిచ్చేస్తానంటున్నాడు. విడాకులు దొరగ్గానే మనం పెళ్ళి చేసుకుందాం అని పద్మ-రాజాని ఒత్తిడి చేయడం ప్రారంభించింది.

ఇంకొకడి పెళ్ళాం ఫ్రీగా లభిస్తేనే మజా. పెళ్ళి అంటే సమస్యలే. అందుకని ఇదిగో అదిగో అంటూ కుంటిసాకులతో కాలయాపన చేస్తూ వచ్చాడు రాజా.

ఈలోగా అతనికి వేరే అమ్మాయితో వివాహం నిశ్చయం అయింది.

హఠాత్తుగా ఓరోజు-అక్కడ పద్మ, యిక్కడ రాజా ఒంటరిగా ఉండే శుభతరుణం తోసుకొచ్చింది. కోరకుండా లభించిన ఆ వరాన్ని ఒదులు కోవాలనిపించలేదు రాజాకి.

నిజానికి తను ఆఫీసు పనిమీద ఆరోజు గౌతమిలో సికిందరాబాద్‌కి వెళ్ళవలసి ఉంది. రిజర్వేషన్ చేయించుకున్నాడు కానీ-రా రమ్మని ఇటు పద్మ, అటు గౌతమి పిలుస్తున్నారు.

ఎవరికి ఓటు అని కాసేపు తర్జనభర్జన పడి చివరకు పద్మకే ఓటు అనుకొని హుషారుగా విజిల్ వేసుకుంటూ దొడ్డిగుమ్మం ద్వారా పక్కింటి బెడ్‌రూంలో దూరాడు రాజా..సుమారు ఏడు గంటలకు..గ్లవ్స్ ధరించి, బాకు బొడ్డున దోపుకొని.

అయితే అతనికి ప్రేమభరిత ఆనందమయ ఆహ్వానం అందలేదు. రాజాకి పెళ్ళి అని తెలిసిన పద్మ ఆడపులి లాగా విరుచుకుపడింది.

"రేపే నేనూ, జగదీష్ లాయర్‌ని కలుస్తున్నాం. విడాకుల కోసం దరఖాస్తు చేస్తున్నాం. నిన్నే నమ్ముకుని యింతకు తెగించిన నన్నేం చేయదలుచుకున్నావ్? నీ పాటికి నువ్వు పెళ్ళి చేసుకుంటే నా గతేం కాను? అదేం కుదరదు. నీ పెళ్ళి పెటాకులు చేసి నేరుగా మీ యింటికొచ్చి కూర్చుంటాను జాగ్రత్త!" అని గర్జించింది అతని కాలర్ దొరక బుచ్చుకొని పిచ్చిగా గుంజుతూ.

అన్నంత పనీ ఆమె చేసి తీరుతుందని రాజాకి తెలుసు. ఆమె చేతిలో చిక్కుకున్న కాలర్‌ని గుంజుకున్నాడు. ఆమె యింకా రెచ్చిపోతోంది. పిచ్చికోపం ఆవహించి ఆవేశంగా బాకు తీశాడు రాజా.

* * *

"ఆవేశంగా బాకునైతే తీశానుగాని, ప్రియురాలు కదా చంపలేకపోయాను. నన్ను నమ్మండి సార్! దువ్వెన నుండి మీరు సేకరించిన కేశాలు నావి కావు" కన్నీళ్ళతో దీనంగా అన్నాడు రాజా.


"అవును. ఆ కేశాలు నీవి కావని మాకూ తెలుసు" అని కాసేపాగి "మీ నాన్నవా?" గద్దించాడు చైతన్య. ప్రక్కనే పిడుగు పడినట్లు హడలిపోయాడు రాజా.

"ఆ కేశాల్లో నల్లరంగు వేసిన పండు వెంట్రుకలున్నాయి. నవరత్నతైలం రాసుకునే అరవై ఏళ్ళ పైబడిన వ్యక్తివి అవి. మీ నాన్న నవరత్న తైలం, హెయిర్‌డై వాడుతారు కదూ?"

తలవంచుకొని ఉండిపోయాడు రాజా.

"చెప్పు. ఇప్పటికే మీ నాన్నని అరెస్ట్ చేయడానికి పోలీసు బృందం వెళ్ళింది. తండ్రీ కొడుకుల్ని సెల్‌లో పడేసి మా పద్ధతిలో నిజం కక్కించగలం. మర్యాదగా నిజం చెబితే నీ ఒంటికే మంచిది" కర్కశంగా అన్నాడు గోపాల్.

పూర్తిగా డీలా పడిన రాజా గొణుక్కుంటున్నట్లు చెప్పాడు "బాకు ఎత్తానుగాని పొడవ లేకపోయాను. చంపుతావా? చంపరా, చంపు! పిచ్చిగా అరుస్తూ మీద మీదకొచ్చేసింది పద్మ. నేను పొడిచే లోగా...ఎప్పుడొచ్చారో ఏమో నా వెనక నిల్చున్న మా నాన్న నా చేతిలోని బాకు లాక్కుని ఆమెను పొడిచేశారు. నెలరోజుల్లో పెళ్ళి కావలసిన నేను పక్కింటి ప్రేమాయణంలో పడడం గమనించిన నాన్న మమ్మల్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి స్వగ్రామం వెళ్ళినట్టే వెళ్ళి తను ఒక్కరే యిక్కడికొచ్చి క్షణిక ఆవేశంలో అనాలోచితంగా ఆయన చేసిన పని అది. ఆమె చనిపోయాక కూల్‌గా ఆలోచించి వాళ్ళ కిచెన్‌లో వున్న బాకుకి రక్తం పట్టించి అక్కడ పడేశాం. గ్లవ్స్ ఉన్నాయి కాబట్టి నా వేలి ముద్రలు ఎక్కడా పడవు. నాన్న కూడా వేలి ముద్రలు పడకుండా జాగ్రత్త పడ్డారు. నేరం జగదీష్ మీదకు పోతుందనుకున్నాం. నేను బట్టలు మార్చుకొని ప్రయివేటు బస్సులో సికిందరాబాద్‌కి వెళ్ళిపోయాను. సాక్ష్యాధారాలన్నీ మాయం చేసి నాన్న ఊరికెళ్ళిపోయారు. నేను సికిందరాబాద్‌లో ఒక రోజుండి ఆఫీసు పని చూసుకొని వచ్చేశాను."




కొద్దిదూరంలో నిలిపిన జీప్‌లోంచి ఇద్దరు పోలీసులొచ్చి రాజాకి బేడీలు తగిలించి జీప్ ఎక్కించారు. మరో యిద్దరు పోలీసులు ఇల్లంతా సోదా చేశారు. సూట్‌కేసులోని రాజా గ్లవ్స్ దొరికాయి. పెరట్లో జాంచెట్టు వద్ద కొత్తగా తవ్విన ఆనవాళ్ళు చూసి మట్టి తొలగించగా గోతిలో రక్తసిక్తం అయిన బట్టలు దొరికాయి.

* * *

"శవం ప్రక్కన దొరికిన బాకు హత్యాయుధం కాదని ఎలా కనిపెట్టారు సార్?" ఆరాధనగా అడిగాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

"పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో గాయం పొడవు మూడు అంగుళాలు, లోతు నాలుగు అంగుళాలు అని ఉంది. కానీ జగదీష్ బాకు వెడల్పు పిడి వద్ద నాలుగు అంగుళాలుంది. పొడవు ఆరు అంగుళాలు"

"బాకు పూర్తిగా శరీరంలోకి దిగి ఉండకపోవచ్చు కదా"

"అలా అయితే బాకు మీద రక్తం నాలుగు అంగుళాల మేర ఉండాలి కానీ ఆ బాకు పొడవునా రక్తం ఉంది అదీ కాక చర్మాన్ని చీల్చుకొని బాకు శరీరంలోకి దిగినప్పుడు దాని కొనవద్ద చర్మకణాలు కూడా ఉండాలి. కానీ ఆ బాకుకి అలా లేవు. అంతేకాదు పిడి వరకూ బాకు శరీరంలో దిగినప్పుడు గాయం చుట్టూ పిడి రాపిడి వల్ల చర్మం రేగిపోతుంది. శవం ఫోటోల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే గాయాల చుట్టూ రేగిన చర్మం కనిపిస్తోంది. అందువల్ల హత్యకు నాలుగు అంగుళాల పొడవున్న బాకుని మాత్రమే ఉపయోగించారన్నమాట" వివరించాడు చైతన్య.

"మీ వద్ద నేర్చుకోవలసింది ఎంతో ఉంది సార్..మొదటి కేసులో అభాసుకాకుండా రక్షించారు. థాంక్స్" మనస్ఫూర్తిగా అన్నాడు గోపాల్.

♣